సాక్షి ఖమ్మం

శుక్రవారం । 10 । మార్చి । 2023



ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

రాష్ట్రప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. 10లో



తాలు మిర్చీ తక్కువేం కాదు!

మునుపెన్నడూ లేని విధంగా ఖమ్మం మార్కెట్‌లో ఎర్ర మిర్చితో పాటు తాలు మిర్చికి కూడా మంచి ధర లభిస్తోంది. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
37°/ 19°

వాతావరణం

శుక్రవారం ఉదయం, సాయంత్రం చలిగాలులు వీచే అవకాశముంది. మధ్యాహ్నం మాత్రం ఉష్ణోగ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నలుగురు సీఐల బదిలీ

- ఎక్కడా పోస్టింగ్ ఇవ్వని అధికారులు

ఖమ్మంక్రైం: జిల్లాలో పలువురు సీఐల బదిలీ చేస్తూ ఐజీ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. నగరంలోని ముగ్గురు సీఐలతోపాటు ఖమ్మం రూరల్ సీఐకి కూడా స్థానచలనం కలిగింది. ఖమ్మం వన్‌టౌన్ సీఐ చిట్టిబాబు స్థానంలో కొత్తగూడెం స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న టి.స్వామి, ఖమ్మం త్రీటౌన్ సీఐ సర్వయ్య స్థానంలో కొత్తగూడెం వన్ టౌన్ సీఐ బత్తుల సత్యనారాయణ, ఖానాపురం హవేలీ సీఐ రామకృష్ణ స్థానంలో నిజామాబాద్‌లో సీఐగా పనిచేస్తున్న టి.శ్రీహరిని కేటాయించారు. అలాగే, ఖమ్మం రూరల్ సీఐగా పనిచేస్తున్న శ్రీనివాస్ స్థానంలో భూపాలపల్లి జిల్లా సీఐ రాజిరెడ్డిని నియమించారు. కాగా, ఇక్కడి నుంచి బదిలీ చేసిన నలుగురికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొనడం గమనార్హం.

మహిళా అథ్లెట్ల ఎంపికకు 11న పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి మహిళా అథ్లెట్ల ఎంపిక పోటీలను ఈనెల 11న ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఇక్కడ ఎంపిక చేసే జిల్లా జట్టు ఈనెల 19న హైదరబాద్‌లో జరిగే ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొంటుందని అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళా అథ్లెట్లు ఉదయం 9 గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు.

సిటీ బస్టాండ్‌లోనూ కార్గో సేవలు




కార్గో పాయింట్‌ను ప్రారంభిస్తున్న వేణుగోపాల్

ఖమ్మం మామిళ్లగూడెం: ఇటీవల బస్సులు రాకపోకలు ప్రారంభమైన ఖమ్మం సిటీ బస్టాండ్‌లో కార్గో సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈమేరకు కార్గో పాయింట్‌ను గురువారం ఖమ్మం, వరంగల్ జిల్లాల కార్గో మేనేజర్ వేణుగోపాల్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిటీ బస్టాండ్‌లో ఉదయం 9నుండి సాయంత్రం 6గంటల వరకు కార్గో సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. జిల్లావాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖమ్మం డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ బండెల వీరభద్రం, ఉద్యోగులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

వైరారూరల్: రెండో విడత దళితబంధు యూనిట్ల మంజూరుపై రాష్ట్రప్రభుత్వం నుండి ఎలాంటి మార్గదర్శకాలు వెలువడలేదని జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు స్పష్టం చేశారు. వైరా మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం మార్గదర్శకాలు వస్తే తప్ప దళితబంధు లబ్ధిదారుల ఎంపిక ఉండదని తెలిపారు. కానీ కొందరు దళారులు యూనిట్లు ఇప్పిస్తామని చెబుతున్నట్లు తెలిసిందని, అలాంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కాగా, వైరా నియోజకవర్గంలో దళితబంధుకు సంబంధించి మొదటి విడతలో 83 యూనిట్లు గ్రౌండింగ్ చేశామని సీఈఓ తెలిపారు. ఈసమావేశంలో కల్లూరు డీఎల్పీఓ ప్రభాకర్‌రావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కె.శ్రీదేవి పాల్గొన్నారు.

పాఠశాలలో రాష్ట్ర పరిశీలకుడి తనిఖీ



విద్యార్థులను సామర్థ్యాలను పరిశీలిస్తున్న అబ్దుల్ నబీ

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు జిల్లా పరిషత్ పాఠశాలను రాష్ట్ర పరిశీలకుడు అబ్దుల్ నబీ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 6నుండి 8వ తరగతి విద్యార్థుల హిందీ భాషా సామర్థ్యాలను పరీక్షించారు. వీరికి పరీక్ష నిర్వహించడంతో పాటు ఉపాధ్యాయుడి బోధన తీరును పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ బీ.వీ.రామాచారి పాల్గొనగా, ఆతర్వాత జింకలగూడెం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లో డీఈఓ

తల్లాడ: తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన ఊరు–మన బడి కింద చేపట్టిన పనులను గురువారం డీఈఓ సోమశేఖరశర్మ తనిఖీ చేశారు. అలాగే, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి సామర్థ్యాలను పరిశీలించారు. డీఈఓ వెంట ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చకచకా భూసేకరణ

గ్రీన్‌ఫీల్డ్ హైవేను మూడు ప్యాకేజీలుగా విభజించారు. ప్యాకేజీ-1 నిడివి 39.04 కి.మీ. కాగా, ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్, చింతకాని, కొణిజర్ల, వైరా మండలాల్లో 548.0800 ఎకరాలకు గాను 506.0525 ఎకరాలు సేకరించి నిర్వాసితులకు రూ.147.34 కోట్ల పరిహారం చెల్లించారు. ఇక ప్యాకేజీ-2 నిడివి 30.07 కి.మీ.గా నిర్ణయించగా వైరా, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి మండలాల్లో 424.1900 ఎకరాలకు గాను 409.0075 ఎకరాలు సేకరించి రూ.98.73 కోట్లు చెల్లించారు. అలాగే, 19.434 కి.మీ.గా ఉన్న ప్యాకేజీ-3కి గాను పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో 383.3325 ఎకరాలకు గాను 371.1200 ఎకరాలు సేకరించి రూ.90.51 కోట్ల పరిహారం చెల్లింపు పూర్తయింది.

ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ఇలా..

రహదారి నిడివి	89.174 కి.మీ.
అవసరమైన భూమి	1,356.2025 ఎకరాలు
సేకరించింది	1,286.1800
సేకరిస్తున్న గ్రామాలు	

31గ్రామాలు (పది మండలాలు)



భూములిచ్చి సహకరించండి

ఖమ్మంరూరల్: కోదాడ – కురవి జాతీయ రహదారి కోసం రైతులు భూములు ఇచ్చి సహకరించాలని అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా కోరారు. ఖమ్మం రూరల్ మండలం ఆరెంపులలో గురువారం ఆమె భూనిర్వాసిత రైతులతో సమావేశమయ్యారు. మార్కెట్ ధరకు మూడురెట్లు అదనంగా పరిహారం ఇవ్వనున్నామని, ఈ విషయంలో అభ్యంతరాలు ఉంటే తెలపాలని సూచించారు. ఈసమావేశంలో ఆర్డీఓ రవీంద్రనాథ్, తహసీల్దార్ టి. సుమ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా

జాతీయ రహదారులతో జిల్లాకు మహర్దశ

- చివరి దశలో పాలేరు లింక్ కెనాల్ భూసేకరణ
- ఖమ్మం-వరంగల్ హైవే కోసం కసరత్తు
- సత్తుపల్లి ట్రంక్ కెనాల్‌లో రైతులకు అందని పరిహారం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో జాతీయ రహదారులతోపాటు ఇతర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ వేగం పుంజుకుంది. ఆరు జాతీయ రహదారులతోపాటు సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, బుగ్గవాగు ప్రాజెక్టు, కొండపల్లి - కాజీపేట మూడో రైల్వేలైన్ నిర్మాణాలకు సంబంధించి భూసేకరణ వివిధ దశల్లో ఉంది. ముఖ్యంగా ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే భూసేకరణ శరవేగంగా సాగుతుండగా, సీతారామ ప్రాజెక్టులో భాగంగా పాలేరు లింక్ కెనాల్ కింద భూసేకరణ చివరిదశకు చేరింది. అలాగే సత్తుపల్లి ట్రంక్ కెనాల్‌కు సంబంధించి భూసేకరణ పూర్తి కావొస్తున్నా రైతులకు ఇంకా పరిహారం అందకపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది. కాగా, జాతీయ రహదారుల నిర్మాణం పూర్తయితే రవాణా వ్యవస్థ మెరుగుపడి జిల్లాకు మహర్దశ పడుతుందని భావిస్తున్నారు.

అధికారుల ప్రత్యేక దృష్టి

జాతీయ రహదారులకు సంబంధించి జిల్లాలో చేపట్టాల్సిన భూసేకరణ, పనుల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్‌హెచ్–365ఏ ప్రాజెక్ట్ కింద ఖమ్మం–కోదాడ నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి భూసేకరణ జరుగుతోంది. 22.35 కి.మీ. పొడవైన ఈ రహదారి కోసం నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం రూరల్ మండలాల్లో 12 గ్రామాల నుంచి 286.2075 ఎకరాలకు గాను 256.2875 ఎకరాల భూమి సేకరించారు. అలాగే, ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారికి మొత్తం 306.2600 ఎకరాల్లో 281.1225 ఎకరాల భూసేకరణ పూర్తిచేశారు. ఇప్పటికే ఈ పనులు కూడా పూర్తయ్యాయి. అలాగే ఖమ్మం–కురవి నాలుగు వరుసల రహదారి పనుల కోసం భూసేకరణ చేయాల్సి ఉంది. 15.165 కి.మీ. పొడవు గల ఈ ప్రాజెక్ట్ కోసం ఖమ్మం రూరల్ మండలానికి చెందిన ఐదు గ్రామాల్లో భూమి సేకరిస్తారు. ఇక ఎన్‌హెచ్–163జీ నాగపూర్- అమరావతిలో భాగంగా ఖమ్మం–వరంగల్ సెక్షన్ కింద 16.68 కి.మీ. జాతీయ రహదారి నిర్మాణం కానుంది. ఇందుకోసం రఘునాథపాలెం, ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్ మండలాల్లోని ఎనిమిది గ్రామాల్లో భూమి సేకరిస్తారు. అలాగే ఖమ్మం–విజయవాడ సెక్షన్ కింద జాతీయ రహదారికి రఘునాథపాలెం, చింతకాని, కొణిజర్ల, బోనకల్, మధిర, ఎర్రుపాలెం, వైరా మండలాల్లో 24 గ్రామాల నుండి భూసేకరణ చేయాల్సి ఉంది. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో సర్వే పూర్తి కాగా.. మరికొన్ని చోట్ల చేయాల్సి ఉంది.


పాలేరు లింక్ కెనాల్‌కు 1,569 ఎకరాలు

సీతారామ ప్రాజెక్టులో భాగంగా పాలేరు లింక్ కెనాల్ నిర్మాణానికి జిల్లాలో భూసేకరణ పూర్తి కావొచ్చింది. ఐదు మండలాల్లోని 15 గ్రామాల్లో 1,717.34 ఎకరాల భూమికి గాను 1,569 ఎకరాల భూసేకరణ పూర్తయింది. ఇదే ప్రాజెక్టు కింద సత్తుపల్లి ట్రంక్‌కెనాల్‌కు సంబంధించి 330.15 ఎకరాలకు గాను 325.30 ఎకరాలు సేకరించారు. అయితే భూనిర్వాసితులకు రూ.34.93 కోట్లు చెల్లించాల్సి ఉన్నా ఇప్పటివరకు చెల్లించలేదు. అలాగే, బుగ్గవాగు ప్రాజెక్టుకు సంబంధించి అవార్డు పాస్ అయినప్పటికీ రైతుల ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో వారు ఎదురుచూస్తున్నారు.

రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు ‘సీతారామ’ పనులు !

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సాగు నీరు అందించేలా నిర్మిస్తున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్(ఎస్ఆర్ఎల్ఐపీ) 13వ ప్యాకేజీ పనులను రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ దక్కించుకుంది. ఈ ప్యాకేజీ పనుల అంచనా విలువ రూ.301.45 కోట్లు కాగా 0.99 శాతం లెస్(రూ.298.47 కోట్లు)తో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పొందింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం పాపకొల్లు నుంచి ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం బురదరాఘవాపురం వరకు 11.9 కిలోమీటర్ల మేర పనులు చేయాల్సి ఉంటుంది. పాలేరు లింక్ కెనాల్ పనులు పాపకొల్లు నుంచి ప్రారంభమవుతాయి. ప్రధాన కాల్వ తవ్వడంతో పాటు సీసీ లైనింగ్ పనులన్నీ ఈ ప్యాకేజీలో భాగంగా చేయాల్సి ఉంటుంది. అయితే ఈ పనుల కోసం బీవీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అంచనా విలువ కన్నా 4.95 శాతం (రూ.316.37 కోట్లు) ఎక్కువగా టెండర్ దాఖలు చేసింది. అలాగే హెచ్ఈఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ అంచనా విలువ కన్నా 4.5 శాతం(రూ.315.02 కోట్లు) ఎక్సెస్‌తో ఆన్‌లైన్ టెండర్ దాఖలు చేశారు. కాగా, ప్రభుత్వం గురువారం ఆన్‌లైన్ టెండర్లను తెరవగా అంచనా ధర కన్నా తక్కువకు కోట్ చేసిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు పనులు దక్కాయి.

తీగల వంతెనకు అడుగులు!



కేబుల్ బ్రిడ్జి నమూనా

ఖమ్మంమయూరిసెంటర్: నగరానికి కొత్త శోభ తీసుకొచ్చేలా మున్నేరుపై నిర్మించే తీగల వంతెన పనులకు అడుగు పడింది. ఈ నిర్మాణానికి సంబంధించి ఈపీసీ టెండర్ కోసం ప్రభుత్వం గురువారం జీఓ విడుదల చేసింది. ఖమ్మంలో మున్నేరుపై తీగల వంతెన నిర్మాణానికి గతంలోనే రూ.180 కోట్లు కేటాయించిన విషయం విదితమే. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈపీసీ టెండర్ల పరిశీలన, ఖరారు కోసం కమిటీని నియమించింది. కన్వీనర్, కోకన్వీనర్లుగా ఆర్అండ్‌బీ ఈఎన్‌సీలు పి.రవీందర్‌రెడ్డి, గణపతిరెడ్డి, సభ్యులుగా ఆర్అండ్‌బీ సీఈలు పి.సతీష్, పి.మధుసూదన్‌రెడ్డిని నియమించారు. మొత్తం 420 మీటర్ల పొడవైన ఈ బ్రిడ్జి నిర్మాణంలో 300 మీటర్ల తీగల వంతెన ఉంటుందని, హైదరాబాద్‌లోని దుర్గంచెరువు తీగల వంతెన నమూనాలో నిర్మాణం జరగబోతుందని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఓ ప్రకటనలో వెల్లడించారు. కాగా, నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయడమే కాక టెండర్ల కోసం జీఓ జారీ చేయడంపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంత్రి పువ్వాడ కృతజ్ఞతలు తెలిపారు.

20 రోజుల్లో రూ.11.32 కోట్లు రావాలి

కేఎంసీ అధికారులకు కమిషనర్ దిశానిర్దేశం



పన్నుల వసూళ్ల కేంద్రం వద్ద మాట్లాడుతున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇరవై రోజుల సమయమే ఉన్నందున అధికారులంతా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు రావాల్సిన పన్ను బకాయిలపై దృష్టి సారించాలని కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. కేఎంసీ సమావేశ మందిరంలో అన్ని విభాగాల అధికారులతో గురువారం సమావేశమైన ఆయన కేఎంసీకి రావాల్సిన రూ.31,15,86,000 ఆదాయంలో రూ.19,83,31,000 వసూలు చేసినట్లు తెలిపారు. మిగతా రూ.11.32కోట్ల పైచిలుకు నగదును ఇరవై రోజుల్లో వసూలు చేసేలా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్, ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేయగా, ఒక్కో అధికారి 100 అసెస్‌మెంట్ల బకాయిలు వసూలు చేయాలని తెలిపారు. రోజుకు రూ.50 లక్షల మేర వసూలు చేయగలిగితే మంచి ఫలితాలు వస్తాయని కమిషనర్ చెప్పారు. అనంతరం నగరంలోని పలు చెల్లింపుదారుల కేంద్రాలను కమిషనర్ ఆదర్శ్ సురభి పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను కూడా ఆయన తనిఖీ చేశారు. ఈకార్యక్రమాల్లో అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, రెవెన్యూ అధికారి జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మారనున్న సత్తుపల్లి రూపురేఖలు

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- రూ.77.20 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం




చెరువు వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం సత్తుపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ.60 కోట్ల నిధులు కేటాయించిందని.. ఏడాదిలో పనులు పూర్తయితే పట్టణ రూపురేఖలు మారతాయని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అన్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అధ్యక్షతన గురువారం నిర్వహించగా రూ.77.20 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌ను ఆమోదించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బడ్జెట్‌లో పది శాతం తప్పక గ్రీనరీకి వినియోగించాలని స్పష్టం చేశారు. గృహ, వాణిజ్య సముదాయాలన్నింటినీ గుర్తించి పన్నులు వసూలు చేయగలిగితే ఆదాయం పెరుగుతుందని తెలిపారు. అనంతరం సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ సీఎం ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో ఎక్కువ నిధులు సమకూర్చుకుని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే వేశ్యకాంతల చెరువును పరిశీలించి రూ.3 కోట్లతో ట్యాంక్‌బండ్‌గా చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. పబ్లిక్‌హెల్త్ ఈఈ రంజిత్‌కుమార్, ఆర్డీఓ కె.సూర్యనారాయణ, నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈఈ మరియన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, వైస్ చైర్మన్ తోట సుజలరాణి, కౌన్సిలర్లు మట్టా ప్రసాద్, చాంద్‌పాషా, ఎస్.జమలమ్మ, ఏ.విజయనిర్మల, మౌలాలీ, టి.ప్రకాశరావు, వి.పుష్పావతి పాల్గొన్నారు.

వైభవంగా రామయ్య నిత్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం వైభవోపేతంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో స్వామివారిని కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఎడ్ల బలప్రదర్శన, కబడ్డీ పోటీలు ఆరంభం



క్రీడాకారులతో కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాదారంలో అంకమ్మ జాతర సందర్భంగా జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బండ లాగుడు బల ప్రదర్శన పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ జాతర సందర్భంగా గ్రామీణ క్రీడాపోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కాగా, తెలుగు రాష్ట్రాల నుంచి తొలిరోజు నాలుగు పళ్ల విభాగంలో 9 జతల వృషభాలు పాల్గొనగా, పోటీలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అలాగే, జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను కూడా ఎమ్మెల్యే ప్రారంభించగా కాసేపు క్రీడాకారులతో కబడ్డీ ఆడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఏసీపీ బస్వారెడ్డి, ఎంపీపీ వజ్జా రమ్య, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, సర్పంచ్ ఈవూరి సుజాతతో పాటు కనమర్లపూడి పుష్పలత, పగిడిపత్తి శ్రీనివాస్, ఆకుల వెంకటేశ్వర్లు, ఈవూరి శ్రీనివాసరెడ్డి, చౌడం నాగేశ్వరరావు, తుమ్మా ధనమూర్తి, కనమర్లపూడి రాము, ఆకుల మల్లేష్, శివారెడ్డి, రామచంద్రుడు, యడవల్లి చంద్రయ్య, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్చక, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రమాణ స్వీకారం చేసిన కమిటీల బాధ్యులతో ఉపేంద్రశర్మ

ఖమ్మంగాంధీచౌక్: దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగులు, అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని దేవాదాయ శాఖ అర్చక, ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. ఇటీవల ఎన్నికైన జిల్లా దేవాదాయ ఉద్యోగ, అర్చక సంఘాల నూతన కమిటీలు గురువారం డీపీఆర్‌సీ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేశాయి. ఈ కార్యక్రమంలో ఉపేంద్రశర్మ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అనంతరం అర్చక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాములూరి వీరభద్రరావు, నరహరి రామకృష్ణాచార్యులు, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట కూర వెంకటేశ్వర్లు, బగాది మురళితో పాటు కార్యవర్గ సభ్యులతో దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారుల సంఘం అధ్యక్షుడు కొత్తూరు జగన్మోహన్‌రావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈకార్యక్రమంలో అర్చక, ఉద్యోగులు కాశావఝుల రామశర్మ, మధుసూధనాచార్యులు, అవగాహన రామకృష్ణశర్మ, నైనకంటి హరికృష్ణ శర్మ, ఇరుకులపాటి కృష్ణప్రసాద్, పొట్టిపింజర రాందాసు, పర్చా ప్రవీణ్‌కుమార్, పరాశరం రవీంద్రచార్యులు, కాండూరి కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

బోరుకైనా ఓకే.. సాగుకైనా సరే!

- అటవీ శాఖలో ఇంటి దొంగలు
- పోడు భూముల్లో బోర్లకు రూ.30 వేల చొప్పున వసూళ్లు
- అయినా దృష్టి సారించని ఉన్నతాధికారులు
- వరుస ఫిర్యాదులతో ఇటీవల ముగ్గురిపై వేటు



ఖమ్మంమయూరిసెంటర్: అడవులను కాపాడాల్సిన అటవీ ఉద్యోగులు అక్రమాలకు తెరలేపుతున్నారు. అడవిని కాపాడే క్రమంలో కొందరు అధికారులు, సిబ్బంది ప్రాణాలనే పణంగా పెడుతుంటే.. మరికొందరు మాత్రం అడవిని ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. అటవీ ప్రాంతాల్లో పోడు సాగు చేస్తున్న వారు బోర్లు వేయించుకోవడానికి లోపాయికారిగా సహకరిస్తూ అటవీ చట్టాలకు తూట్లు పొడుస్తున్నారు. అడవులనే ఆధారంగా చేసుకొని జీవిస్తున్న గిరిజనులు తాగునీటి కోసం బావులు తవ్వుకుంటామంటే కనికరించని అధికారులు, సిబ్బంది అక్రమ సమపార్జన కోసం ఎంతకైనా తెగిస్తున్నారు. ఇటీవల కాలంలో అటవీశాఖలో అక్రమార్కుల చేతివాటం పెరిగినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

అధికారుల అండ ఉందా?

అడవుల్లో చిన్న మొక్క తీసినా, చెట్టు నరికినా అధికారులు వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటుంటారు. కానీ కొంత కాలంగా జిల్లాలో ప్రధానంగా ఖమ్మం రేంజ్ పరిధిలో అక్రమాలు పెరిగాయి. వేటగాళ్లతో సిబ్బంది కుమ్మక్కై అడవి జంతువులను వేటాడినా, కరెంట్ తీగలు పెట్టి హతమారుస్తున్నా పట్టుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కాగా, ఈ రేంజ్‌లో అధికారుల అండతోనే ఇదంతా జరుగుతుందన్న విమర్శలు వస్తున్నాయి. ఈక్రమంలోనే బోర్లు వేయించే వరకు పట్టించుకోని అధికారులు.. అంతా అయిపోయాక రెండు నెలల అనంతరం సిబ్బందిని సస్పెండ్ చేయడం ఈ విమర్శలకు బలం చేకూరుస్తోంది. కారేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో బోర్లు వేయడం వెనుక ప్రజాప్రతినిధులు, అధికారుల అండ ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇదేసమయాన సిబ్బందిపై చర్యలు తీసుకోవడంలోనూ అధికారులు వివక్ష చూపిస్తున్నారని శాఖలో చర్చ జరుగుతోంది.

విచారణకు ప్రత్యేక బృందం

కారేపల్లి మండలం చీమలపాడు సెక్షన్‌లో ఇటీవల బోర్లు వేయడంపై జిల్లా ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. అటవీ భూముల్లో రెండు నెలల వ్యవధిలో 40 బోర్లు వేసిన విషయం రాష్ట్ర అధికారులకు చేరడంతో విచారణ జరపాలని ఆదేశించారు. దీంతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేయగా, మధిర, సత్తుపల్లి, కారేపల్లి మండలాల్లో విచారణకు రంగంలోకి దిగారు. ఇప్పటికే ముగ్గురిని సస్పెండ్ చేయగా, బోర్లు వేయడం వెనుక ఇంకా ఎవరిదైనా పాత్ర ఉందా, వసూలు చేసిన నగదు ఎవరెవరికి అందిందే అంశంపై ఈ బృందం విచారణ చేపట్టనుంది. కాగా, వేసిన బోర్లను పూడ్చాలని సిబ్బందిని అధికారులు ఆదేశించారు. ఇక ఈ అంశంపై అటవీశాఖలో ఓ ఉన్నతాధికారిని వివరణ కోరగా.. అటవీ భూముల్లో బోర్లు వేయడానికి సహకరించిన అందరిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సుమారు 25బోర్లు వేసినట్లు తేలగా, ప్రత్యేక బృందం విచారణ చేపడుతోందని చెప్పారు.

డబ్బులిస్తే చాలు...

అటవీ చట్టం ప్రకారం అటవీ భూముల్లో బోర్లు వేసేందుకు వీలు లేదు. అక్కడ పోడు చేసుకున్న వారు సైతం వర్షం ఆధారంగా పండే పంటలనే పండించుకోవాలి. ఈమేరకు ఎలాంటి అక్రమాలు జరగకుండా అటవీ అధికారులు, సిబ్బంది నిరంతరం సెక్షన్లు, బీట్లలో పర్యవేక్షించాలి. కానీ జిల్లాలో ఇటీవల కొందరు అధికారులు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు పోడు భూములను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. పట్టా భూముల్లో సైతం బోర్లకు అనుమతించని సిబ్బంది... అడవిలో మాత్రం బోర్లు వేయిస్తున్నారు. అందుకోసం ఒక్కోబోర్‌కు రూ.30వేల నుండి రూ.40 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కారేపల్లి సెక్షన్ పరిధిలో గత రెండు నెలల్లో 40 బోర్లు వేయగా.. రూ.1.20 కోట్లు వసూలు చేసినట్లు జిల్లా అటవీ అధికారులు గుర్తించారు. దీంతో కారేపల్లి మండలం చీమలపాడు సెక్షన్ ఆఫీసర్ సాంబశివరావు, బీట్ ఆఫీసర్లు రమేష్, విజయను సస్పెన్షన్ చేశారు. అయితే, ఇదే సెక్షన్‌లో మరో 50 బోర్లు వేసేందుకు అడ్వాన్స్ కూడా తీసుకున్నారని సమాచారం. ఇదేకాక పోడు భూముల్లో సాగుకు ఎకరాకు రూ.500చొప్పున వసూలు చేస్తున్నారని కూడా తెలిసింది.

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్‌తో పేద కుటుంబాలకు భరోసా



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

చింతకాని: అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న పేదలకు సీఎం సహాయ నిధి ద్వారా రాష్ట్రప్రభుత్వం చేయూతనిస్తోందని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తెలిపారు. చింతకాని రైతువేదికలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సిఫారసుతో పది మందికి మంజూరైన రూ.4,13,500 విలువైన చెక్కులు అందజేసి మాట్లాడారు. అనంతరం రైతుబంధు సమితి మండల కన్వీనర్ పానుగోటి రత్నాకర్ ప్రమాణ స్వీకారంలో కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, సర్పంచ్‌లు బండి సుభద్ర, ఆలస్యం నాగయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంట్యాల పుల్లయ్య, బొడ్డు వెంకటరామయ్యతో పాటు గురిజాల హన్మంతరావు, మంకెన రమేష్, వంకాయలపాటి లచ్చయ్య, దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, నూతలపాటి వెంకటేశ్వరరావు, చల్లా అచ్చయ్య, షేక్ బడేసాహెబ్, మిట్టపల్లి కొండలరావు, ఆకుల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పగిలిన కారు టైర్లు.. తప్పిన ప్రమాదం



టైర్లు పగలటంతో..రోడ్డు కిందికి దూసుకపోయిన కారు

కారేపల్లి: ప్రమాదవశాత్తు కారు టైర్లు పగలటంతో వాహనం రోడ్డు కిందకు దూసుకుపోయింది. మండలంలోని గాంధీనగర్ సమీపాన గురువారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఇల్లెందు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు గాంధీనగర్ సమీపంలోకి రాగానే ముందు టైర్లు పగిలిపోయాయి. దీంతో కారు ఒక్కసారిగా రోడ్డు కిందకు దూసుకపోయింది. వాహనంలో ముగ్గురు మహిళలు, డ్రైవర్ ఉండగా, ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. కాగా, సదరు వ్యక్తులు కారును అక్కడే వదిలేసి వెళ్లిపోయారని స్థానికులు తెలిపారు.

బెల్ట్‌షాపులో బీర్లు చోరీ!

నేలకొండపల్లి: ఎండలు మండిపోతున్నాయి. మద్యపాన ప్రియులు బీర్లు తాగేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఈక్రమంలో ఓ వ్యక్తి కొనుగోలు చేయడం ఎందుకు అనుకున్నాడేమో కానీ బెల్ట్‌షాప్‌లో చొరబడి బీర్లు ఎత్తుకెళ్లారు. రెండోసారి కూడా చోరీకి యత్నించి పట్టుబడ్డాడు. మండలంలోని మంగాపురం తండాలో ఓ వ్యక్తి బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం దొంగ దుకాణంలో చొరబడి మూడు కేసుల బీర్లు ఎత్తుకెళ్లాడు. బుధవారం రాత్రి మళ్లీ చోరీకి యత్నించగా అప్పటికే నిఘా వేసిన వ్యాపారి పట్టుకున్నారు. ఈమేరకు పోలీసులకు సమాచారం ఇచ్చి నిందితుడిని అప్పగించాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

ప్రేమించాడని చావబాదారు..

- విచక్షణారహితంగా దాడి చేసిన యువతి బంధువులు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి



బొమ్మగాని వెంకటేష్ (ఫైల్)



మృతుడి బంధువులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

కామేపల్లి(కారేపల్లి)/ఖమ్మం రూరల్: ప్రేమించడమే ఆ యువకుడు చేసిన పాపం.. ప్రేమను వ్యతిరేకించడానికి కారణాలేమిటో తెలియదు కానీ బంధువు అని కూడా చూడకుండా యువతి బంధువులు విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో స్పృహ కోల్పోయిన యువకుడిని ఆయన ఇంటికి తీసుకెళ్లారు. ఆతర్వాత ఐదు రోజులకు ఆస్పత్రిలో చేర్పించడంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కామేపల్లి మండలం పండితాపురానికి చెందిన బొమ్మగాని వెంకటేష్(23) ఖమ్మంలోని ఓ సంస్థ సరుకుల డెలివరీ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. తమ బంధువైన చింతకాని మండలం చిన్నమండవకు చెందిన బీటెక్ విద్యార్థినిని కొన్నాళ్లుగా ప్రేమిస్తున్నాడు. అయితే, వీరి ప్రేమ విషయం తెలిసినప్పటి నుంచి యువతి తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్నారు. ఈక్రమంలో ఈనెల 2న పండితాపురంలో జరుగుతున్న శివాలయం జాతరకు ఆమెను వెంకటేశ్ హాస్టల్ నుంచి తీసుకొచ్చాడు. అయితే, ఆయన తండ్రి అమ్మాయిని ఎందుకు తీసుకొచ్చావని మందలించడంతో 3న మోటార్ సైకిల్‌పై హాస్టల్‌కు తీసుకెళ్లాడు. కాగా, జ్వరంగా ఉందని యువతి ఇంటికి వెళ్లినట్లు ప్రిన్సిపాల్ ఆమె తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. కానీ ఆమె ఇంటికి రాకపోవడంతో 3న ఉదయం తల్లిదండ్రులు పరుపగాని లక్ష్మయ్య, రేణుక, బంధువులు బండి కృష్ణ, తాటిమల్ల నాగేశ్వరరావు ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాలోని కళాశాల వద్దకు వచ్చారు. ఇంతలోనే బైక్‌పై వెంకటేష్, యువతి వస్తుండడంతో గమనించిన వారు ఆగ్రహంతో బైక్‌ను అడ్డుకుని వెంకటేష్‌ను చితకబాదారు. దీంతో వెంకటేష్ స్పృహ కోల్పోయాక వారంతా వెళ్లిపోయారు. కాసేపటికి మేల్కొన్న వెంకటేష్ ఫోన్ ద్వారా తన తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు వెళ్లి ఇంటికి తీసుకొచ్చారు. కాగా, 8వ తేదీన వెంకటేశ్ తన ఆరోగ్యం బాగాలేదని చెప్పడంతో ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఆయన మృతి చెందాడు.

బంధువుల ఆందోళన

యువకుడు వెంకటేష్ చావుకు కారణమైన లక్ష్మయ్య, ఇతరులపై చర్యలు తీసుకోవాలని ఆయన బంధువులు డిమాండ్‌చేశారు. వెంకటేష్‌ను విచక్షణా రహితంగా కొట్టడంతోనే మృతి చెందాడంటూ బంధువులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద ఆందోళనకు దిగారు. తొలుత ధర్నాచౌక్‌లో కూడా నిరసన తెలిపారు. దీంతో ఖమ్మం టూటౌన్ సీఐ శ్రీధర్, ఖమ్మం రూరల్ సీఐ శ్రీనివాస్ చేరుకుని విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని నచ్చచెప్పడంతో వారు ఆందోళన విరమించారు. కాగా, వెంకటేష్ తండ్రి బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధికి చేయూత అభినందనీయం



తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీడీఓ, దాతలు

ఏన్కూరు: స్వగ్రామానికి మరిచిపోకుండా తల్లిదండ్రుల పేరిట ట్రస్ట్ ఏర్పాటుచేసిన అభివృద్ధి పనులు చేపడుతున్న డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరరావు అభినందనీయులని ఎంపీడీఓ బయ్యారపు అశోక్ అన్నారు. మండలంలోని కేసుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నారాయణ – బసవమ్మ ట్రస్ట్ అధ్వర్యంలో రూ.20లక్షలో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్ మాట్లాడుతూ నాగేశ్వరావును అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఎంఈఓ దుగ్గిరాల జయరాజ్, సర్పంచ్ బానోతు నాగమణి, ఉపసర్పంచ్ పి.రామారావు, ఎస్ఎంసీ చైర్మన్ మాలోతు శ్రీను, హెచ్ఎం బి.శంకర్‌తో పాటు ఏ.రాము, వెంకటేశ్వర్లు, ఎల్.సురేష్, బి.కృష్ణవేణి, బి.విజయ, కడియాల కోటేశ్వరావు, కొండపల్లి నాగేశ్వరావు, పి.పిచ్చయ్య, తన్నీరు మధుసూదన్‌రావు, శెట్టిపల్లి రామారావు, శెట్టిపల్లి నరేష్, ఆవుల నర్సయ్య, కొవ్వూరి నాగేశ్వరావు, శెట్టిపల్లి సురేష్, బానోతు బాషానాయక్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కరోనా కార్టూన్లతో పుస్తకం



కార్టూన్ల బుక్‌లతో డైరెక్టర్ మూర్తి, డీడీ సత్యనారాయణ తదితరులు

ఖమ్మం సహకారనగర్: ఖజానా శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వెంటపల్లి సత్యనారాయణ కరోనా సమయాన ప్రజల ఇబ్బందులు, వైరస్‌తో సమస్యలతో వేసిన కార్టూన్లతో పుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకాన్ని ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ రాష్ట్ర సంచాలకులు కేఎస్ఆర్‌సీ.మూర్తి గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. అడిషనల్ డైరెక్టర్ యాస్మిన్ సుల్తానా, జేడీ ప్రవీణప్రభ, సురేష్‌బాబు, తెలంగాణ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మోదుగు వేలాద్రితో పాటు పరశురాం, శ్రీనివాసరావు, మోదుగు వేలాద్రి, విజయ్‌కుమార్, ముర్తుజా హుస్సేన్, రవీంద్రబాబు, ప్రవీణ్ పాల్గొన్నారు.

12న సత్తుపల్లిలో 'పొంగులేటి' సమ్మేళనం



సభాస్థలాన్ని పరిశీలిస్తున్న విజయబాబు, నాయకులు

సత్తుపల్లి: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వార్యన ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తుండగా, ఈనెల 12న ఆదివారం సత్తుపల్లిలో సమావేశం నిర్వహణకు నిర్ణయించారు. ఇందులో భాగంగా పట్టణంలోని సిద్దారం రోడ్డు ఎంఆర్ గార్డెన్ ఎదురుగా ఖాళీ స్థలాన్ని ఎంపిక చేసి వేదిక పనులు మొదలుపెట్టారు. సుమారు పదివేల మందికిపైగా నాయకులు, కార్యకర్తలను సమీకరించనున్నట్లు చెబుతుండగా, సత్తుపల్లి ఏసీపీ బి.రామానుజం గురువారం పరిశీలించి పార్కింగ్, భద్రతపై సూచనలు చేశారు.

సొంత నియోజకవర్గం..

సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు మండలం నారాయణపురం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వగ్రామం కావడం, నియోజకవర్గంలో ఆయనకు బలమైన అనుచర వర్గం ఉండడంతో సమ్మేళనాన్ని విజయవంతం చేయడానికి ఆయన వర్గీయులు కసరత్తు చేస్తున్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 6న నారాయణపురంలో పొంగులేటి ముఖ్యనేతలతో సమావేశమై మండలానికి ముగ్గురు చొప్పున నాయకులతో జనసమీకరణకు కమిటీలు ఏర్పాటుచేశారు. కాగా, ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించగా ఐదు చోట్ల పొంగులేటి అభ్యర్థులను ప్రకటించారు. ఇక సత్తుపల్లిలో జరిగే సమావేశంలో అభ్యర్థిని ప్రకటిస్తారా, సమ్మేళనానికి ప్రజాప్రతినిధులు, నాయకుల్లో ఎవరెవరు వస్తారన్నది చర్చనీయాంశంగా మారింది.

నేడు జిల్లాలో పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. పాలేరు, ఖమ్మం, మధిర నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో జరిగే కార్యక్రమాలకు ఆయన హాజరవుతారని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



తగరం రవీంద్ర (ఫైల్)

సత్తుపల్లిరూరల్: కుటుంబ కలహాల నేపథ్యాన మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సత్తుపల్లి రాజీవ్‌కాలనీకి చెందిన తగరం రవీంద్ర(35) తన అత్తగారి ఊరైన ఏపీలోని ఏలూరులో ఉంటూ ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. అక్కడ భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో ఆయన భార్య జ్యోతి ఆరు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన ఆయన భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో బుధవారం సాయంత్రం బయటకు వెళ్లి రాత్రి పది గంటలకు తన స్నేహితులకు ఫోన్ చేసి చనిపోతున్నట్లు చెప్పి స్విచాఫ్ చేశాడు. దీంతో స్నేహితులు, బంధువులు పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. ఇక గురువారం ఉదయం గౌరిగూడెం సమీపంలోని తమ్మిలేరు వాగు ఒడ్డున రవీంద్ర చెప్పులు, సెల్‌ఫోన్, లెటర్ దొరగడంతో జాలర్లతో తమ్మిలేరులో గాలించగా రవీంద్ర మృతదేహం బయటపడింది. ఆయనకు భార్య జ్యోతితో పాటు ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.రాము తెలిపారు.

బావిలో దూకి మహిళ..

కూసుమంచి: కుటుంబ కలహాల నేపథ్యాన ఓ మహిళ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని కోక్యాతండాకు చెందిన బానోత్ శాంతమ్మ(45) గురువారం వ్యవసాయ పనులకు వెళ్లి అక్కడే బావిలో దూకింది. ఈ విషయాన్ని గమనించిన రైతులు ఇచ్చిన సమాచారంతో కుటుంబీకులు ఆమెను బయటకు తీసేలోగానే మృతి చెందింది. కాగా, ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దివారిగూడెంకు చెందిన బత్తుల నాగేష్(42) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించే ఆయన కొన్నాళ్లుగా మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో భార్యాభర్తల మధ్య ఘర్షణ మొదలైంది. ఈక్రమంలో 4వ తేదీన ఆయన మద్యం మత్తులోనే పురుగుల మందు తాగి ఇంటికి రాగా కుటుంబ సభ్యులు ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగేశ్ గురువారం మృతి చెందాడని ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

బిడ్డలకు తల్లిని దూరం చేసిన రోడ్డు ప్రమాదం



ఇండ్ల మానస (ఫైల్)

తిరుమలాయపాలెం: కుమార్తెను ఆస్పత్రిలో చూపించేందుకు బైక్‌పై వెళ్తున్న దంపతులు రోడ్డు ప్రమాదానికి గురికావడం, చికిత్స పొందుతూ తల్లి మృతి చెందడంతో పిల్లలకు అమ్మ ప్రేమ దూరమైంది. ఈ విషాద ఘటన మండలంలోని జల్లెపల్లిలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఇండ్ల రమేష్, మానస దంపతులకు కుమారుడు వివేక్, కుమార్తె లక్ష్మీప్రియ ఉన్నారు. వీరిలో లక్ష్మీప్రియ అనారోగ్యానికి గురికావడంతో తొర్రూరు ఆస్పత్రికి ఈనెల 5న తీసుకెళ్తుండగా దంతాలపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వీరిలో మానస తలకు తీవ్రగాయం కాగా హన్మకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. దీంతో పిల్లలకు తల్లి ప్రేమ దూరం కాగా... మానసకు ఏడేళ్ల కుమారుడు వివేక్ తలకొరివి పెడుతుండగా బంధువులతో పాటు గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

ఖమ్మంసహకారనగర్: భారత్‌జోడో యాత్ర సందర్భంగా రాహుల్‌గాంధీ ఇచ్చిన సందేశాన్ని ప్రతీ గడపకు కార్యకర్తలు తీసుకెళ్లడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సూచించారు. ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఆయన పీసీసీ సభ్యులు, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపట్టి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలుచేయనున్న పథకాలను వివరించాలని సూచించారు. ఇంకా ఈ సమావేశంలో పీసీసీ సభ్యులు మహ్మద్ జావేద్, రాయల నాగేశ్వరారావు, కిసాన్ సెల్, ఎస్సీ సెల్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు మొక్కా శేఖర్‌గౌడ్, బొడ్డు బొందయ్య, పుచ్చకాయల వీరభద్రంతో పాటు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, శీలం ప్రతాప్‌రెడ్డి, మాలోత్ రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

కూసుమంచి: మండలంలోని చేగొమ్మకు చెందిన రాచకొండ శేఖర్ ద్విచక్ర వాహనాన్ని బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పెట్రోల్ పోసి తగులబెట్టారు. ఈసందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన పలువురు తనను కొంతకాలంగా బెదిరిస్తున్నారని వాపోయారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అనుకూలంగా వ్యవహరిస్తుండడంతో కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. కాగా, కొన్ని కేసుల విషయంలో శేఖర్ తన వాహనాన్ని తగలబెట్టుకుని ఇతరులపై నెపం మోపుతున్నారని గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఒక ప్రకటన విడుదల చేశారు.



క్లుప్తంగా...

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్లు



గన్‌పార్కులో అమరవీరుల స్థూపం వద్ద ఎమ్మెల్సీ అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటా శాసనమండలి బీఆర్ఎస్ అభ్యర్థులు గురువారం తమ నామినేషన్లను దాఖలు చేశారు. పార్టీ అభ్యర్థులు దేశపతి శ్రీనివాస్, నవీన్ కుమార్, చల్లా వెంకట్రామిరెడ్డి తమ నామినేషన్ పత్రాలను శాసనసభలో రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. కార్యక్రమానికి మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ విప్‌లు బాల్క సుమన్, గువ్వల బాల్‌రాజ్, శంబీపూర్‌రాజు సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అంతకుముందు ఎమ్మెల్సీ అభ్యర్థులు గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు.

పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థికి మద్దతు



సాక్షి, హైదరాబాద్: టీటీజేఏసీ, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పీఆర్‌టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ మద్దతు ప్రకటించింది. పీఆర్‌టీయూటీఎస్ నేతలు పింగిలి శ్రీపాల్ రెడ్డి, బీరెల్లి కమలాకర్‌ను గురువారం టీఎస్‌సీపీఎస్‌ఈయూ నేతలు శ్రీకాంత్, నరేష్‌గౌడ్ కలిసి ఈమేరకు మద్దతు ప్రకటించారు.

గాల్‌రెడ్డిని గెలిపించండి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డిని గెలిపించాలని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఉపాధ్యాయ ఓటర్లకు గురువారం బహిరంగ లేఖ రాశారు.

కుటుంబ పాలనే బీఆర్ఎస్ మోడల్!

'కరీంనగర్ కవాతు' బహిరంగ సభలో ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భాగేల్

- తెలంగాణలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేవు
- కేసీఆర్ కుటుంబంలో మాత్రం అందరికీ ఉద్యోగాలు వచ్చాయి
- తాము రైతులకు మద్దతు ధర, పంట మార్పిడికి ప్రోత్సాహం ఇస్తున్నామని వెల్లడి
- తెలంగాణలో ఛత్తీస్‌గఢ్ మోడల్ అమలు చేస్తాం: రేవంత్‌రెడ్డి



బహిరంగసభలో ప్రసంగిస్తున్న ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భాగేల్. వేదికపై దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావ్ ఠాక్రే, భట్టి, జైరాం రమేశ్, జీవన్‌రెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ''తెలంగాణ వచ్చినా రైతులు, నిరుద్యోగులకు ఉద్యోగ , ఉపాధి అవకాశాలు లభించలేదు. కానీ కేసీఆర్ కుటుంబంలోని కేటీఆర్, హరీశ్‌రావు, లిక్కర్ క్వీన్ కవితకు ఉద్యోగాలు వచ్చాయి..'' అని ఛత్తీస్‌గఢ్ సీఎం, కాంగ్రెస్ నేత భూపేశ్ భాగెల్ మండిపడ్డారు. దేశ సంపద అంతా ఒకరిద్దరి చేతుల్లోకి వెళ్లిందని.. అది బీజేపీ గుజరాత్ మోడల్ అని.. అదే తెలంగాణలో కుటుంబ పాలన బీఆర్ఎస్ మోడల్ అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ 'హాథ్ సే హాథ్ జోడో' యాత్ర కరీంనగర్‌కు చేరుకున్న సందర్భంగా.. గురువారం సాయంత్రం పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో 'కరీంనగర్ కవాతు' పేరిట బహిరంగ సభ నిర్వహించింది. ఈ సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ జైరాం రమేశ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, సురేశ్ షెట్కార్, సిరిసిల్ల రాజయ్య, వీహెచ్, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సభలో భూపేశ్ భాగెల్ ప్రసంగిస్తూ.. ఛత్తీస్‌గఢ్‌లో రైతుల ధాన్యానికి మద్దతు ధర రూ.2,640, నిరుద్యోగ భృతి కింద రూ.2,500, పంటమార్పిడికి రూ.9,000, పేడ కిలోకి రూ.2తోపాటు గోమూత్రానికి కూడా డబ్బులు చెల్లిస్తూ.. గ్రామీణుల జీవితాల్లో వెలుగులు నింపామని చెప్పారు. తెలంగాణలోనూ కాంగ్రెస్‌ను గెలిపించాలని, ఛత్తీస్‌గఢ్ మోడల్‌ను అమలు చేద్దామని పిలుపునిచ్చారు.

రైతులు, నిరుద్యోగులకు పెద్దపీట: రేవంత్

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని, ఛత్తీస్‌గఢ్ మోడల్‌తో రైతులకు, నిరుద్యోగులకు పెద్దపీట వేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పారు. ''తెలంగాణ రాష్ట్రం ఇస్తే రాజకీయంగా ఏపీలో నష్టపోతామని తెలిసినా.. మాటకు కట్టుబడి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చింది. కానీ నీళ్లు, నిధులు, నియామకాల పేరిట తెలంగాణలో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ రైతులు, యువతను దగా చేశారు. కరీంనగర్ నుంచి కేసీఆర్, బి.వినోద్, బండి సంజయ్‌లు ఎంపీలుగా గెలిచి ఏం సాధించారు? అదే 2009లో పొన్నం ప్రభాకర్‌ను ఒక్కసారి ఎంపీగా గెలిపిస్తే.. తెలంగాణ తెచ్చి చూపించారు. తెలంగాణ బిల్లు పెట్టిన రోజున సమైక్యవాదులు స్పీకర్ కళ్లలో కారం కొట్టి బిల్లును ఆపాలని చూసినా.. జైపాల్‌రెడ్డి వ్యూహం, తెలంగాణ ఎంపీల తెగువతో బిల్లు ఆమోదం పొందింది. కానీ తల్లిని చంపి, బిడ్డను బతికించారంటూ ప్రధాని మోదీ తెలంగాణ ఆవిర్భావాన్ని అవహేళన చేశారు. ఆయనకు ఎలా ఓటేస్తారు?'' అని రేవంత్ ప్రశ్నించారు. తెలంగాణ మనుగడ కోసం విభజన చట్టంలో బయ్యారం ఉక్కు పరిశ్రమ, ఐటీఐఆర్ ప్రాజెక్టు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన వర్సిటీ, ఐఐటీ వంటివాటిని చేర్చితే.. అవేమీ అమలుకు నోచుకోలేదన్నారు. సీఎం కేసీఆర్ 3 వేల వైన్ షాపులు, 60వేల బెల్టుల షాపులతో తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా మార్చారని ఆరోపించారు. మోసపూరిత గుజరాత్ మోడల్ కావాలో, తాగుబోతుల తెలంగాణ మోడల్ కావాలో, రైతులు–యువత అభ్యున్నతికి ఛత్తీస్‌గఢ్ మోడల్ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారు.

బలహీన వర్గాల కోసమే తెలంగాణ: మాణిక్‌రావ్ ఠాక్రే

ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, బీసీల అభ్యున్నతి కోసమే సోనియాగాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని, కానీ గత 8 ఏళ్లలో ఈ ఆకాంక్షలేవీ నెరవేరలేదని మాణిక్‌రావు ఠాక్రే పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులు పెరిగాయని ఆరోపించారు.

కేసీఆర్‌ను ఓడించాలి: జైరాం రమేశ్

ఛత్తీస్‌గఢ్ మోడల్‌లో రైతుల జీవితాల్లో వెలుగులు కనిపిస్తున్నాయని.. దానిని తెలంగాణలో అమలు చేయాలని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ''కేసీఆర్ నిజాంలా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. కేసీఆర్ హటావో.. తెలంగాణ బచావో'' అని పిలుపునిచ్చారు.

ఆదిశంకరాచార్య తర్వాత రాహుల్ గాంధీనే: ఉత్తమ్

ఆది శంకరాచార్య తర్వాత దేశమంతా తిరిగిన వ్యక్తి రాహుల్ గాంధీ మాత్రమేనని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. విద్వేషాన్ని విడిచి దేశ సమైక్యతను కాపాడాలని రాహుల్ సందేశం ఇచ్చారన్నారు. తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు.

సామాజిక తెలంగాణ ఏర్పడలేదు: మల్లు భట్టివిక్రమార్క

ప్రజలు కోరుకున్న సామాజిక తెలంగాణ ఏర్పడలేదని, ప్రాణహితకు అంబేద్కర్ పేరును తొలగించారని భట్టి విక్రమార్క చెప్పారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం ద్వారా ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేకపోయారని, కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టుల నీటితోనే పంటలు పండుతున్నాయని పేర్కొన్నారు. భూమి లేని నిరుపేదలకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.7 వేలు ఇస్తోందని.. కానీ ఇక్కడ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమీ ఇవ్వడం లేదని విమర్శించారు.

బీఆర్ఎస్‌కు వనపర్తి జెడ్పీ చైర్మన్ రాజీనామా

ఇద్దరు ఎంపీపీలు, 11 మంది సర్పంచ్‌లు..

- ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు, ఒక సింగిల్ విండో డైరెక్టర్..
- పలువురు ఉప సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు సైతం అదేబాటలో
- సల్కెలాపూర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడి
- ఆత్మాభిమానం చంపుకోలేకనన్న నేతలు
- మంత్రి నిరంజన్‌రెడ్డికి షాక్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఇలాకా వనపర్తి జిల్లాలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో ముసలం మొదలైంది. మంత్రికి సన్నిహితులుగా పేరొందిన ముఖ్య నాయకులు సైతం పార్టీకి రాజీనామా చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్ రెడ్డితోపాటు వనపర్తి, పెద్దమందడి ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఐ.సత్యారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ సాయిచరణ్‌రెడ్డి రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. ఈ మేరకు ఖిల్లాఘనపురం మండలం సల్కెలాపూర్ గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు పత్రాలు ప్రదర్శించారు. వీరితో పాటు మరో 11 మంది సర్పంచ్‌లు, ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు, పలువురు ఉపసర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు రాజీనామా చేస్తున్నట్లు స్వయంగా ప్రకటించడమే కాకుండా బీఆర్ఎస్ లో తాము ఎదుర్కొన్న బాధలను వెళ్లగక్కారు.

ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేక..: ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ మామూలు కార్మికులు సైతం ఆత్మగౌరవం కోరుకుంటారని.. అలాంటిది అధికారంలో ఉండి కూడా ఆత్మగౌరవాన్ని పొందలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేకే రాజీనామా చేసినట్లు వెల్లడించారు.

నిరంజన్‌రెడ్డికి పేరొచ్చిందంటే మేమే కారణం

పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి మాట్లాడుతూ మంత్రి నిరంజన్‌రెడ్డికి నీళ్ల నిరంజన్‌రెడ్డి అనే పేరు వచ్చేందుకు తమ శ్రమే కారణమన్నారు. ఈ ప్రాంతానికి నీళ్లు తెచ్చింది ఎవరో వారి మనసులో ఉందని.. త్వరలోనే వారు బాహాటంగా చెప్పే రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నియంత పాలన అంతం కోసం ఇక నుంచి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని చెప్పారు. కాగా, నియోజకవర్గంలో ఇప్పటివరకు తిరుగులేని నాయకుడిగా పేరు తెచ్చుకున్న మంత్రి నిరంజన్ రెడ్డికి అతడి సొంత సెగ్మెంట్ నుంచే వ్యతిరేకత పెల్లుబికడంతో పాటు తాజా పరిణామాలు ఎదురుదెబ్బేనని రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది.

కలుషితాహారంతో 70 మంది విద్యార్థినులకు అస్వస్థత

- మహబూబాబాద్‌లోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఘటన
- ఆందోళన చెందొద్దని రాష్ట్ర మంత్రి సత్యవతి భరోసా



ఆక్సిజన్ వార్డులో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

నెహ్రూసెంటర్/మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో కలుషితాహారం కారణంగా 70 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. బుధవారంరాత్రి విద్యార్థినులు టమాట కూర, సాంబారు, మజ్జిగతో భోజనం చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికే కొంతమంది విద్యార్థినులకు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో పాఠశాలలో ఏఎన్ఎం, స్పెషల్ ఆఫీసర్ మందులు అందించారు. గురువారం ఉదయం బాధిత విద్యార్థినులకు గ్లూకోజ్, ఓఆర్ఎస్ కలిపి తాగించారు. అయినా వారికి వాంతులు, విరేచనాలు అవుతుండటంతో తొలుత పాఠశాలలోనే వైద్యులతో వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో 36 మందిని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వారిలో కొందరికి ఆక్సిజన్ పెట్టారు. మరో 34 మంది విద్యార్థినులను హాస్టల్ గదుల్లోనే నేలపై పడుకోపెట్టి చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. దీనిపై కేజీబీవీ ఎస్‌వో భవానిని వివరణ కోరగా బుధవారంరాత్రి ఆరుగురు విద్యార్థినులకు కడుపునొప్పి, వాంతులు కావడంతో మందులు వేశామని, ఉదయం మరికొంత మందికి అదే పరిస్థితి ఎదురుకావడంతో జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు. విద్యార్థినులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని తెలిపారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై మంత్రి ఆరా..

కస్తూర్బాగాంధీ విద్యాలయంలో కలుషితాహారం విషయం తెలియగానే జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారితో రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖల మంత్రి సత్యవతి రాథోడ్ ఫోన్‌లో మాట్లాడి విద్యార్థుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. విషయం తెలుసుకున్న ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావులు ఆస్పత్రికి చేరుకుని విద్యార్థినులను పరామర్శించారు.

అవినీతి వల్లనే 'వీఆర్వో' వ్యవస్థ రద్దు

హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వ వాదనలు

సాక్షి, హైదరాబాద్: క్షేత్రస్థాయిలో విపరీతంగా అవినీతి పెరిగిపోయిన కారణంగానే వీఆర్వో వ్యవస్థను రద్దు చేశామని హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వాదనలు వినిపించింది. వందల మంది వేరే డిపార్ట్‌మెంట్లలో చేరారని, కేవలం 60 మంది మాత్రం రెవెన్యూ విభాగంలోనే కొనసాగించాలని కోరడం సరికాదని పేర్కొంది. రెవెన్యూశాఖలో ఖాళీలున్నా తమను ఇతర శాఖల్లోకి పంపడం అన్యాయమని పేర్కొంటూ వీఆర్వోలు హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై గతంలో విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం వీఆర్వోలను ఇతర శాఖలకు తరలించడంపై స్టే విధించింది. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం గురువారం మరోసారి విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏజీ వాదనలు వినిపించారు. 'రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అధికారాలతోనే వీఆర్వోలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేయడానికి మార్గదర్శకాలు జారీచేసింది' అని పేర్కొన్నారు. తదుపరి విచారణ కోసం వాదనలను మార్చి 20వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది.


జిల్లా వార్తలు

రాష్ట్ర చెస్ జట్టు కెప్టెన్‌గా పూర్ణచందర్‌రావు



సింగరేణి(కొత్తగూడెం): ఆలిండియా స్థాయి ఉద్యోగుల చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ చెస్ జట్టు కెప్టెన్‌గా డాక్టర్ పూర్ణచందర్‌రావును ప్రభుత్వం నియమించింది. ఈ పోటీలు భువనేశ్వర్‌లో ఈనెల 12, 13, 14వ తేదీల్లో జరగనున్నాయి. ఉద్యోగుల రాష్ట్ర స్థాయి టోర్నీ గత ఏడాది సెప్టెంబర్‌లో జరగగా ప్రథమ స్థానం సాధించిన కొత్తగూడెంలోని రామచంద్ర కాలేజీ ప్రొఫెసర్ పూర్ణచందర్‌రావును తెలంగాణ జట్టు కెప్టెన్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయనను భద్రాద్రి జిల్లా క్రీడాశాఖాధికారి సీతారాం, చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాంబశివరావు, కే.ఎస్.ప్రసాద్ రావు తదితరులు అభినందించారు.

బ్యాడ్మింటన్ గ్రేడ్-1 అంపైర్‌గా మల్లికార్జున్



కొణిజర్ల: జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు గ్రేడ్-1 అంపైర్‌గా కొణిజర్ల మండలం తనికెళ్లకు చెందిన తుప్పతి మల్లికార్జున్ ఎంపికయ్యాడు. ఇటీవల ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణుడైన మల్లికార్జున్‌ను గ్రేడ్-1 అంపైర్‌గా ఎంపిక చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, తెలంగాణలో ఈ ఘనత సాధించిన మూడో వ్యక్తిగా, ఖమ్మం జిల్లా నుంచి మొదటి వ్యక్తి ఆయన నిలిచారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌ను తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గంటా వెంకట్రావు, సభ్యులు నల్లమోతు రఘు, డాక్టర్ సత్యనారాయణమూర్తి, బాలసాని ఆనంద్, పాటిబండ్ల యుగేందర్, పీడీలు రమణ, రామారావు, శ్రీను అభినందించారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి 12న పరీక్ష

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం ఈనెల 12న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉమాదేవి తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న, పూర్తిచేసిన గిరిజన బాలికలు ఈ పరీక్ష రాయడానికి అర్హులని పేర్కొన్నారు. కళాశాలలోనే ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని విద్యార్థినులు గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 94910 63083 నంబర్‌ను సంప్రదించాలని ఆమె తెలిపారు.

తాలు మిర్చీ తక్కువేం కాదు!



ఖమ్మం మార్కెట్‌కు విక్రయానికి తీసుకొచ్చిన తాలుమిర్చి బస్తాలు


- మునుపెన్నడూ లేని విధంగా డిమాండ్
- క్వింటాకు రూ.13 వేలకు పైగా పలుకుతున్న ధర
- కొనుగోళ్లకు ఆయిల్ పరిశ్రమల ఆసక్తి

ఖమ్మంవ్యవసాయం: తాలు మిర్చి అనగానే పెద్దగా అవసరం లేనిది.. అంతగా కొనుగోలు చేయనిది... ధర కూడా ఏదో నామమాత్రంగా ఉంటుందనే భావన సహజం. కానీ ఈ ఏడాది తాలు మిర్చికి డిమాండ్ వచ్చింది. ప్రస్తుతం తాలు మిర్చి ధర క్వింటాకు రూ.13 వేలకు పైగా పలుకుతోంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం తాలుమిర్చికి గరిష్ట ధర రూ.13,200గా నమోదైంది. ఎర్రమిర్చి ధరతో పోలిస్తే నాలుగో వంతు ధర కూడా తాలు మిర్చికి దక్కదు. పదేళ్ల క్రితం ఎర్రమిర్చి ధర రూ.10 వేల వరకు పలకగా తాలు మిర్చి ధర కేవలం రూ.వెయ్యి దాటలేదు. కానీ గత ఏడాది నుంచి తాలు మిర్చికి గిరాకీ పెరిగింది. ఈ ఏడాది మిర్చి సీజన్ ఆరంభంలో క్వింటా రూ.10వేల వరకు తాలు మిర్చి ధర పలకగా, ప్రస్తుతం పెరిగింది. ఎర్రమిర్చి ధర పెరిగిన కొద్దీ తాలు మిర్చికి కూడా డిమాండ్ పెరుగుతోంది. ఈ ధర గత నెల రూ.12వేలకు చేరగా, ఇప్పుడు రూ.13వేలు దాటడం విశేషం. ఎర్ర మిర్చి ధరలో హెచ్చుతగ్గులున్నా తాలు మిర్చి డిమాండ్ తగ్గకపోవడం.. వ్యాపారులు తాలు మిర్చి కోసం ఆరా తీస్తుండడం మార్కెట్‌లో కనిపిస్తోంది.

ఆయిల్ పరిశ్రమల్లో డిమాండ్

వివిధ దేశాల్లో మిర్చి ఆయిల్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో ఆయిల్ పరిశ్రమలు నెలకొల్పారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం, మహబూబాబాద్ జిల్లాలోని కురవి మండలం మన్నెగూడెం, మరిపెడ మండలంలో బంగ్లా తదితర ప్రాంతాల్లో ఆయిల్ పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల బాధ్యులు గత ఏడాది వరకు ఎర్ర మిర్చిని కొనుగోలు చేసే ఆయిల్‌ను ఉత్పత్తి చేసేవారు. కానీ ఇప్పుడుఎర్రమిర్చి ధర పెరగటంతో తాలు వైపు మొగ్గు చూపుతున్నారు. తాలు మిర్చి నుంచి కూడా ఆయిల్ శాతం అధికంగానే వస్తుండడంతో కొనుగోళ్లు పెంచగా, వీరికి తోడు దేశీయంగా వినియోగించే కారంలో తాలుమిర్చి కారం కలుపుతుండడంతో ధరకు రెక్కలొచ్చాయి.

కొనుగోళ్లు పెరిగాయి



మిర్చి ఆయిల్ పరిశ్రమల బాధ్యులు తాలుమిర్చికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎర్ర మిర్చి ధర ఎక్కువగా ఉండడం, తాలు మిర్చి నుంచి కూడా ఆయిల్ శాతం ఆశాజనకంగా ఉండడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఖమ్మం పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమలతో పాటు హైదరాబాద్, ఒంగోలు నుంచి కూడా ఆర్డర్లు వస్తుండడంతో డిమాండ్ పెరిగింది. – మలిశెట్టి వెంకటేశ్వర్లు, వ్యాపారి, ఖమ్మం వ్యవసాయ మార్కెట్

ఎక్కడా నాణ్యత తగ్గొద్దు..



లడ్డూల తయారీని పరిశీలిస్తున్న ఈఓ రమాదేవి

'నవమి' ఏర్పాట్ల పరిశీలనలో ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో జరగనున్న కల్యాణ బ్రహ్మోత్సవాలకు సంబంధించి చేపడుతున్న పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించొద్దని, ఏమైనా అవకతవకలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈఓ రమాదేవి హెచ్చరించారు. గురువారం ఆమె ఆలయ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న నవమి ఏర్పాట్లు, యాగశాల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం లడ్డూ తయారీ విభాగంలో కూడా తనిఖీ చేశారు. భక్తులకు స్వచ్ఛమైన, నాణ్యమైన ప్రసాదాలు అందించాలని, లడ్డూలు పాడైపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాలం ముగిసిన ప్రసాదాలను ఎట్టి పరిస్థితుల్లో అమ్మొద్దని ఈఓ తెలిపారు. అనంతరం స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. ఆమె వెంట రామాలయ ఈఈ రవీందర్, సీసీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఆస్తులు, స్థలాలను కాపాడాలి



వీసీలో మాట్లాడుతున్న డైరెక్టర్లు బలరాం, శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణికి చెందిన ఆస్తులు, స్థలాలను కాపాడడంపై జనరల్ మేనేజర్లు, ఎస్టేట్, సెక్యూరిటీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.బలరాం ఆదేశించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. స్థలాల పరిరక్షణకు ఎంత ఖర్చయినా సరే కంచెలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈమేరకు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పర్యవేక్షించాలని సూచించారు. డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్వీకే.శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ అధికారులు కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సమావేశంలో జీఎంలు బి.హన్మంతరావు, కట్టా బసవయ్య, రవిప్రసాద్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శశిధర్‌రాజుతో పాటు రామకృష్ణ, కోడూరి శ్రీనివాస్, వేణుమాధవ్, జాకీర్ హుస్సేన్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట



టీఎన్జీవోస్ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి పువ్వాడ, సంఘం బాధ్యులు

టీఎన్జీవోస్ డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరించిన మంత్రి పువ్వాడ

ఖమ్మం స్పోర్ట్స్: ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ఉద్యోగులకు వేతనాలు ఇస్తూ ఇతర సౌకర్యాలు కల్పిస్తుండడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. టీఎన్జీవోస్ ఆధ్వర్యాన రూపొందించిన డైరీ, క్యాలెండర్లను ఖమ్మంలో ఆయన టీఎన్జీవోస్ కేంద్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల రాజేందర్, రాయకంటి ప్రతాప్‌తో కలిసి ఆవిష్కరించారు. అలాగే, మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మంత్రి పువ్వాడ మాట్లాడుతూ టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ మరమ్మతుల కోసం తన నిధుల నుంచి రూ.25 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ హసన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి ఆర్.వీ.ఎస్.సాగర్, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు శాబాసు జ్యోతి, ఈ.స్వప్నతో పాటు ముత్యాల సత్యనారాయణ, ఖాజామియా, సునీల్‌రెడ్డి, నందగిరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను సత్కరించిన మంత్రి

ఖమ్మంమయూరిసెంటర్: ఎమ్మెల్యే కోటాలో ఎంపిక చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు అభ్యర్థులు నవీన్‌కుమార్, దేశపతి శ్రీనివాస్, చల్లా వెంకట్రాంరెడ్డి గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా వీరిని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హైదరాబాద్‌లో సత్కరించారు.

సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ పోటీలకు కేయూ జట్లు



జిమ్నాస్టిక్స్ జట్లతో కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ సవితాజ్యోత్స్న



చెస్ క్రీడాకారులతో సవితాజ్యోత్స్న

కేయూ క్యాంపస్: చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో ఈనెల 10నుంచి 14వ తేదీ వరకు ఇంటర్ యూనివర్సిటీ జిమ్నాస్టిక్స్(పురుషుల, మహిళల) పోటీలు జరగనున్నాయి. ఈమేరకు కేయూ జట్లను ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ సవితాజ్యోత్స్న గురువారం తెలిపారు. పురుషుల విభాగంలో కె.కృష్ణాచారి, పి.సూర్యదేవ్, సీహెచ్.ప్రవీణ్‌కుమార్, డి.మోహన్‌కుమార్, ఎండీ ఉమ్అలీ, ఆర్టిస్టిక్స్ జిమ్నాస్టిక్స్ మహిళల విభాగంలో ఎల్.ప్రేమలత, ఎల్.శిరీష, రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో శ్రీసాయిభవ్యను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆయా జట్లకు మేనేజర్‌గా జేఎస్ఎస్ కోచ్ విజయకుమార్ వ్యవహరిస్తారని సవితాజ్యోత్స్న తెలిపారు. అలాగే, చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈనెల 10నుంచి 12వ తేదీ వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ పోటీలకు సైతం కేయూ క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరిలో బి.రామచందర్, జి.కార్తీక్, ఎస్.అఖిల్, ఎ.తరుణ్, జె.ఉపేందర్, ఓ.రంజిత్ ఉండగా, మేనేజర్‌గా మహబూబాబాద్ విజ్ఞానభారతి కళాశాల పీడీ కె.రమేష్ వ్యవహరిస్తారని సవితాజ్యోత్స్న తెలిపారు.